## ఈవీల వినియోగాన్ని పెంచాలి

- సింగరేణి డైరెక్టర్(ఈఅండ్‌ఎం) సత్యనారాయణ


ఎస్టీపీపీలో ఈవీలను ప్రారంభిస్తున్న డైరెక్టర్ సత్యనారాయణ

జైపూర్, ఫిబ్రవరి 18: ఎలక్ట్రిక్ చార్జింగ్ వాహనాల వినియోగాన్ని పెంచాలని సింగరేణి డైరెక్టర్(ఈఅండ్‌ఎం) సత్యనారాయణ సూచించారు. జైపూర్‌లోని ఎస్టీపీపీలో అధికారులకు అద్దె ప్రతిపాదికన ఏర్పాటు చేసిన ఎలక్ట్రిక్ చార్జింగ్ వాహనాలను ఆదివారం అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ చార్జింగ్ వాహనాల వినియోగం పెరిగితే పర్యావరణాన్ని కాపాడినట్లవుతుందని పేర్కొన్నారు. పెట్రోల్, డీజిల్‌తో పోల్చితే వీటి నిర్వహణ ఖర్చు కూడా తక్కువని తెలిపారు. రానున్న కాలంలో అద్దె ప్రతిపాదికన మరిన్ని వాహనాలను పెంచుతామని తెలిపారు. జీఎం బస్వీరెడ్డి, సీఎంవోఐ అధ్యక్షుడు సముద్రాల శ్రీనివాస్, పీఎం రామాశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

## బ్రహ్మోత్సవాలు ప్రారంభం


సప్తాహలో ఈవో, అర్చకులు

దండేపల్లి, ఫిబ్రవరి 18 : గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారి బ్రహ్మోత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. చాదాత్త వైష్ణవ సంప్రదాయం ప్రకారం ఈ ఉత్సవాలు ఈనెల 25 వరకు కొనసాగనున్నాయి. బ్రహ్మోత్సవాల ప్రారంభంలో భాగంగా దేవతా మూర్తుల చిత్రపటాలను గుట్టపై ఉన్న సప్తాహ భజన మండపం వరకు సన్నాయి వాయిద్యాలతో తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిత్యవిధి, ప్రాభోధిక ఆరగింపు, తీర్థ ప్రసాద గోష్టి, విశ్వక్సేనారాధన, దీక్షాకంకణాధారణ పూజలు చేశారు. అనంతరం నిరంతర సప్తాహ భజనలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు, ముఖ్య అర్చకులు రఘుస్వామి, సంపత్‌స్వామి, వేద పండితులు నారాయణశర్మ, అర్చకులు సురేశ్, ధర్మకర్తల మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలి

- మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు
- మేడారానికి ప్రత్యేక బస్సుల ప్రారంభం


జెండా ఊపి మేడారం జాతర బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పీఎస్‌ఆర్

మంచిర్యాల అర్బన్/శ్రీరాంపూర్, ఫిబ్రవరి 18 : మేడారం సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా టీఎస్‌ఆర్టీసీ నడిపిస్తున్న బస్సులను సద్వినియోగం చేసుకోవాలని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్ రావు అన్నారు. వేర్వేరు కార్యక్రమాల్లో భాగంగా మంచిర్యాల జడ్పీ బాలుర పాఠశాల మైదానం, శ్రీరాంపూర్ కాలనీ నుంచి ఏర్పాటు చేసిన బస్సులకు పూజలు చేసి, జెండా ఊపి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ఉందన్నారు. ఉమ్మడి జిల్లా నుంచి 365 బస్సులను మేడారం జాతరకు నడిపిస్తున్నట్లు తెలిపారు. శ్రీరాంపూర్ కాలనీ నుంచి 45 బస్సులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మంచిర్యాల పట్టణ సమీప గోదావరి తీరంలో జాతర ఏర్పాట్లను పరిశీలించారు. ఆర్టీసీ డీఎం రవీంద్రనాథ్, మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్, కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు. సీసీసీలో సమ్మక్క జాతర ఏర్పాట్లను పరిశీలించగా, వెంట నస్పూర్ మున్సిపల్ చైర్మన్ సుర్మిల్ల వేణు, కౌన్సిలర్లు పూదరి కుమార్, మహేశ్, ఆర్టీసీ ఆర్‌ఎం సోలోమాన్, డీఎం అమృత, డిప్యూటీ డీఎంలు ప్రణయ్, ప్రణీత్, నాయకు గెల్లు మల్లేశం, ధర్ని మధూకర్, ఖాలీద్, సీపతి మల్లేశం, కొంతం రమేశ్, సురేశ్ ఉన్నారు. సీసీసీ ముక్కిడి పోచమ్మ ఆలయం వద్ద జాతర పనులను కూడా పరిశీలించారు.

**చెన్నూర్ నుంచి..**

చెన్నూర్, ఫిబ్రవరి 18: చెన్నూర్ నుంచి మేడారం జాతరకు ప్రత్యేక బస్సులను ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ఆదివారం ప్రారంభించారు. చెన్నూర్ నుంచి 110 ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు అధికారులు తెలిపారు. మహిళలకు ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించగా, పురుషులు పెద్దలకు రూ. 410, పిల్లలకు రూ. 220 చార్జీలను వసూలు చేయనున్నారు. రద్దీని బట్టి అదనంగా మరిన్ని బస్సులను నడపనున్నట్లు తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జడ్పీ మాజీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, రీజినల్ మేనేజర్ సులేమాన్, మంచిర్యాల డిపో మేనేజర్ రవీంద్రనాథ్, కాంగ్రెస్ నాయకులు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.


జాతర బస్సు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వివేక్


వాంకిడిలోని తెలంగాణ -మహారాష్ట్ర సరిహద్దులో ఎక్సైజ్ చెక్‌పోస్టు వద్ద వాహనాల నుంచి డబ్బు వసూలు చేస్తున్న ప్రైవేట్ వ్యక్తి

- తెలంగాణ- మహారాష్ట్ర సరిహద్దు అయినా పూర్తి నిర్లక్ష్యం
- ప్రైవేట్ వ్యక్తులతో వసూళ్ల పర్వం
- ఇప్పటి వరకు మూడే కేసులు
- ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువు
- సహాయం కోసమే ప్రైవేటు వ్యక్తులు: జిల్లా ఎక్సైజ్ అధికారి జ్యోతీకిరణ్

## రూ.20 ఇస్తే..

# రైట్ రైట్



### వాంకిడి ఎక్సైజ్ చెక్‌పోస్ట్ వద్ద తనిఖీల తీరిది..

కుమ్రం భీం ఆసిఫాబాద్, ఫిబ్రవరి 18 (నమస్తే తెలంగాణ): అది వాంకిడి మండలంలోని తెలంగాణ -మహారాష్ట్రకు సరిహద్దులో ఉన్న ఎక్సైజ్ శాఖ చెక్‌పోస్ట్... ఇక్కడ ఒక ఎక్సైజ్ సీఐతో పాటు ముగ్గురు కానిస్టేబుల్ స్థాయి అధికారులు విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. ఇరు రాష్ట్రాలకు మద్యం రవాణా జరగకుండా ఈ మార్గం గుండా ప్రయాణించే ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ ఇలాంటివేమి ఉండవు. ఈ చెక్‌పోస్టు నిర్వహణలో అధికారులకు బదులు ప్రైవేటు వ్యక్తులు విధుల్లో కనిపిస్తుంటారు. వీరికి రూ. 20 ఇస్తే చాలు.. ఇటు నుంచి అటు, అటు నుంచి ఇటు వాహనాలకు రైట్ రైట్ చెబుతారు. ఎలాంటి తనిఖీలు ఉండవు. ఈ మార్గం గుండా ఏదైనా వాహనం రాగానే, ఓ వ్యక్తి ఆపుతాడు. వాహన డ్రైవర్ నుంచి రూ. 20 తీసుకుంటాడు. ఇక వాహనాన్ని తనిఖీ లేకుండానే వదిలేస్తాడు. ఇలా రోజుకు సుమారు వెయ్యికి పైగా వాహనాలు తెలంగాణ, మహారాష్ట్రలకు రాకపోకలు సాగిస్తుంటాయి. అంటే ఈ చెక్‌పోస్టు వద్ద నెలకు రూ. 8 లక్షల నుంచి రూ. 10 లక్షల పైచిలుకు వసూళ్ల పర్వం ప్రైవేట్ వ్యక్తుల చేతుల మీదుగా నడుస్తున్నది. మరో వింత ఏంటంటే ఏడాది కాలంలో ఇప్పటి వరకు ఇక్కడ పట్టుబడ్డ కేసులు మూడు మాత్రమే.

**కానరాని తనిఖీలు..**

ఇరు రాష్ట్రాల నుంచి మద్యం అక్రమ రవాణాపై ఈ చెక్‌పోస్టు వద్ద నిఘా కొరవడింది. కేవలం వసూళ్ల మత్తులో పడి, చూసీ చూడనట్లు వదిలేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమ రవాణాపై వాహనం నంబర్‌తో సహా సమాచారం ఉంటే తప్పా, తనిఖీ చేయడం లేదు. ఏడాదికి సుమారు 3.5 లక్షల నుంచి 4 లక్షల వాహనాలు ఈ చెక్‌పోస్టు గుండా రాకపోకలు సాగిస్తుంటాయి. ఇక ఒక్క వాహనానికి రూ. 20 చొప్పున ప్రైవేట్ వ్యక్తుల దందా ఏ విధంగా నడుస్తున్నదో అర్థం చేసుకోవచ్చు. ఇదంతా ఉన్నతాధికారులకు తెలిసే జరుగుతున్నదనే విమర్శలు కూడా లేకపోలేదు.

**సహాయం చేసేందుకే ప్రైవేటు వ్యక్తులు**

*వాంకిడి సరిహద్దు చెక్‌పోస్టు వద్ద ఒక ఎక్సైజ్ సీఐ, ముగ్గురు కానిస్టేబుళ్లు విధులు నిర్వర్తించాలి. సిబ్బంది కొరత కారణంగా, సహాయంగా ఉండేందుకు ప్రైవేటు వ్యక్తులను పెట్టుకున్నాం. ఏడాది కాలంలో మూడు కేసులు నమోదు చేశాం. ఇందులో ఒకటి గంజాయి కేసు. సరుకు దొరికింది.. నిందితులు పారిపోయారు. మరో రెండు కేసుల్లో మద్యం పట్టుకున్నాం.*

**- జ్యోతీకిరణ్,జిల్లా ఎక్సైజ్ అధికారి**

## జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో కాంస్యం

- ఆసిఫాబాద్ విద్యార్థిని ప్రతిభ


విద్యార్థిని ఎం సాక్షి

ఆసిఫాబాద్ టౌన్, ఫిబ్రవరి 18: గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరుగుతున్న జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా విద్యార్థిని కాంస్యం సాధించినట్లు గిరిజన సంక్షేమ శాఖ క్రీడాధికారి మీనా రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసిఫాబాద్ గిరిజన క్రీడా పాఠశాలలో ఎం సాక్షి(9వ తరగతి)అండర్ 14 జావెలిన్ త్రో విభాగంలో అత్యంత ప్రతిభ చూపినట్లు పేర్కొన్నారు. 29.97 మీటర్ల దూరం విసిరి ఈ పతకం కైవసం చేసుకున్నట్లు తెలిపారు. సాక్షితో పాటు ట్రైనర్ విద్యాసాగర్‌ని ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ ఆర్ రమాదేవి, ఏసీఎంవో, పీ ఉద్ధవ్, ఏటీడీవో క్షేత్రయ్య, జీసీడీవో శకుంతల, తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి కే సారంగపాణి, జాయింట్ సెక్రెటరీ పీ వెంకటేశ్వర్ రెడ్డి, ఇండియన్ అథ్లెటిక్స్ టీం కోచ్ నాగపురి రమేశ్, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు, కోట్నాక విజయ్, సట్ల శంకర్, గుండా లక్ష్మణ్, హ్యాండ్ బాల్ శిక్షకులు అరవింద్, ఖోఖో శిక్షకులు తిరుమల్, టీం మేనేజర్ పిట్టల స్వప్న, జిల్లాలోని పీఈటీలు, క్రీడా పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

## ప్రశాంతంగా సీవోఈ ప్రవేశ పరీక్ష

- కుమ్రం భీం జిల్లాలో 828 మంది హాజరు


పరీక్షా కేంద్రాన్ని సందర్శిస్తున్న గిరిజన గురుకులాల సమన్వయాధికారి గంగాధర్

ఆసిఫాబాద్ టౌన్, ఫిబ్రవరి 18: తెలంగాణ గిరిజన గురుకులాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీవోఈ గురుకులాల్లో 2024-25 ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశాలకు ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష జిల్లా కేంద్రంలో ప్రశాంతంగా ముగిసింది. జిల్లా కేంద్రంలో మూడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. గిరిజన బాలుర పాఠశాలలో 447 మందికి 440 మంది, బాలికల గురుకులంలో 216కు 206, గిరిజన గురుకుల డిగ్రీ కళాశాలలో 188 కు 181 మంది విద్యార్థులు హాజరైనట్లు అధికారులు తెలిపారు. మొత్తంగా 851 మందికి 827 మంది పరీక్ష రాసినట్లు చెప్పారు. ఉమ్మడి ఆదిలాబాద్ గిరిజన గురుకులాల సమన్వయాధికారి గంగాధర్ పర్యవేక్షించారు. సీఎస్‌లు సురేశ్, అనిత తదితరులున్నారు.

## ఉమ్మడి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఎన్నిక


అధ్యక్షుడిని సన్మానిస్తున్న క్రీడా సంఘాల నాయకులు

మంచిర్యాల అర్బన్, ఫిబ్రవరి 18 : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కొత్త కమిటీ ఎన్నిక ఆదివారం జడ్పీ బాలుర పాఠశాలలో రాష్ట్ర ఒలింపిక్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మల్లా రెడ్డి, జిల్లా క్రీడా ప్రాధికారిక సంస్థ పరిశీలకులు రాజేశ్, ఎలక్షన్ అధికారి నిమ్మతి శ్రీనివాస్ సమక్షంలో నిర్వహించారు. చీఫ్ ప్యాట్రన్‌గా డాక్టర్ వేణుగోపాలాచారి, చైర్మన్‌గా పార్థసారథి, అధ్యక్షుడిగా గోవర్ధన్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నారాయణ రెడ్డి, జనరల్ సెక్రెటరీగా రఘునాథ రెడ్డి, ట్రెజరర్‌గా రమేశ్, ఉపాధ్యక్షులుగా రాంచందర్, శ్రీధర్ రెడ్డి, సాంబమూర్తి, చంద్రమోహన్ గౌడ్, శ్రీనివాస్, చంద్రయ్య, జాయింట్ సెక్రెటరీలుగా సుధాకర్, ఫ్రాన్సిస్, రమేశ్, శేఖర్, పాండూ నాయక్, శ్రీనివాస రాజు, సభ్యులుగా శ్రీనివాస రెడ్డి, మారయ్య, శరత్ బాబు, శ్రీనివాస్ గౌడ్, దేవేందర్, హరిచరణ్, భూమన్న, ఈశ్వరాచారి, మహేందర్ సింగ్ ఎన్నికయ్యారు.

**రాస్తే రాయండి.. లేదంటే వదిలేయండి..: సెక్రెటరీ**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఎన్నికలు ఆదివారం గోప్యంగా నిర్వహించడంలో మతలబు ఏమిటో తెలియడం లేదు. గతంలో సెక్రెటరీగా పని చేసిన రఘునాథ రెడ్డి ఎన్నికల షెడ్యూల్, ఓటర్ల లిస్టు తదితరాలతో కూడిన వివరాలు మీడియాకు తెలియకుండా జాగ్రత్త పడడం తిరిగి ఆయనే సెక్రెటరీగా ఎన్నికయ్యేందుకు చేసిన హడావిడా.. మరేవైనా కారణాలు ఉన్నాయా అనేది తెలియాల్సి ఉంది. ఈ విషయమై రఘునాథ రెడ్డిని సంప్రదించగా వార్త రాస్తే రాయండి, లేదంటే వదిలేయండి.. అంటూ ఫోన్ కట్ చేశారు. దీనిపై డీవైఎస్‌వో రజ్వీరును వివరణ కోరగా 'మాకు కూడా హెడ్ ఆఫీసు నుంచి ఎలాంటి సమాచారం రాలేదు. వస్తే మాకు అబ్జర్వర్ డ్యూటీ వేస్తారు అని చెప్పారు. పాత డీవైఎస్‌ఓకు ఏమైనా సమాచారం వచ్చిందా అని అడిగితే, ఆయనకు కూడా తెలియదని చెప్పారు. వారి ఎన్నికలు వారు నిర్వహించుకున్నారు. అందులో అబ్జర్వర్ అంటూ నా పేరు కూడా ఫ్లెక్సీలో వేశారు. హెడ్ ఆఫీసు నుంచి మాత్రం ఎలాంటి సమాచారం రాలేదని సమాధానం ఇచ్చారు.

- గోప్యంగా ఎన్నికల నిర్వహణ?


శిర్షా గ్రామం నుంచి బోనాలతో బీరన్న గుడికి వచ్చిన మహిళలు

## భక్తిశ్రద్ధలతో బీరన్న పూజలు



కౌటాల, ఫిబ్రవరి 18: మండలంలోని శిర్షా గ్రామంలో బీరయ్య కల్యాణ మహోత్సవం భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి మహిళలు బోనాలతో బీరన్న ఆలయం వరకు ఒగ్గుడోలు బీర్ల కళాకారుల విన్యాసాలతో, సప్పుల్లతో వచ్చి స్వామి వారికి బోనం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గావుపిల్ల ఇచ్చి స్వామి వారికి పట్నాలు వేశారు. గ్రామమంతా సుభిక్షంగా ఉండాలని వేడుకున్నారు. బీరయ్య-కామరాతి కల్యాణం చేశారు. గ్రామ పెద్దలు ఎగ్గేటి శంకర్, సూర పోషమల్లు, పెద్దల బీరయ్య, అల్లి తిరుపతి, జగ్గయ్య, పోలె శ్రీశైలం, సింగిరి, భీమసేన తదితరులున్నారు.

## వాటర్ యాపిల్

# ఆదాయంఫుల్

### మరో కొత్త పంటకు శ్రీకారం చుట్టిన కేంద్రే బాలాజీ

- నాలుగు మొక్కలు నాటిన రైతు
- ఒక్కోదానికి క్వింటాల్ వరకు దిగుబడి
- కిలోకు రూ.60 చొప్పున విక్రయం
- శ్రమ, పెట్టుబడి లేకుండా లాభాలు




ధనోరలో ఏపుగా పెరిగిన వాటర్ ఆపిల్ చెట్టు, విరగ్గాసిన పండ్లు

కెరమెరి, ఫిబ్రవరి 18 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం ధనోరా గ్రామానికి చెందిన రైతు కేంద్రే బాలాజీ మరో కొత్త రకమైన పంటకు శ్రీకారం చుట్టాడు. గతంలో యాపిల్ సాగు చేసి రాష్ట్ర ఉత్తమ రైతుగా అప్పటి సీఎం కేసీఆర్ చేతుల మీదుగా అవార్డు అందుకొని ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆయన, ప్రస్తుతం వాటర్ యాపిల్‌ను పరిచయం చేశాడు. 2015లో కేరళ నుంచి నాలుగు వాటర్ యాపిల్ మొక్కల(ఒక్కో మొక్కకు రూ. 120)ను కొనుగోలు చేసి తీసుకొచ్చి నాటాడు. ఎరువులు, క్రిమిసంహారక మందులేవీ వాడలేదు. నీళ్లు మాత్రమే పెట్టగా ఏపుగా పెరిగాయి. 2022లో పండ్లు కాయలు పడ్డాయి. యేటా ఫిబ్రవరి, ఏప్రిల్‌లో దిగుబడి వస్తుందని, ఒక్కో చెట్టుకు సుమారు క్వింటాల్ దాకా పండ్లు కాస్తాయని రైతు చెబుతున్నాడు. ఈ యేడాది ప్రస్తుతం పంట చేతికి వస్తున్నది. ఇప్పటి వరకు 50 కిలోల పండ్లు తెంపి, కిలో రూ.60 చొప్పున విక్రయిస్తున్నాడు. ఏమాత్రం శ్రమ.. పెట్టుబడి లేకుండా మంచి ఆదాయం పొందవచ్చని కేంద్రే బాలాజీ చెబుతున్నాడు.

**పెట్టుబడి లేకుండా లాభం..**



*ధనోరాలో యాపిల్ సాగు చేసిన. రాష్ట్ర ఉత్తమ రైతుగా కేసీఆర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న. మళ్లా ఏదైనా కొత్తరకమైన పంట వేయాలనుకున్న. వాటర్ యాపిల్ గురించి తెలుసుకున్న. 2015లో కేరళ వెళ్లి నాలుగు మొక్కలు తెచ్చి నాటిన. ఇక్కడ మొక్కలు పెరుగుతాయో లేవో అనుకున్న. 2022 వరకు పెద్దగైనయ్. కాయలు పడ్డయి. ఇప్పటికే రెండుసార్లు దిగుబడి వచ్చింది. ఇది మూడోసారి. రూపాయి పెట్టుబడి లేకుండా లాభం పొందవచ్చు. మున్ముందు మరిన్ని చెట్లు పెట్టాలనుకుంటున్న.*

**- కేంద్రే బాలాజీ, రైతు ధనోర**

## మురుగు నీరు..

# మంచి నీరెలా సారు..

వేమనపల్లి,ఫిబ్రవరి 18 : చేతి పంపు ఉన్నప్రాంతంలో మురుగు నీరు చేరి స్థానిక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మండలంలోని జక్కెపల్లి గ్రామంలోని ఎస్టీ వాడలో ఉన్న చేతి పంపు చుట్టూ మురుగు నీరు చేరింది. దీంతో తాగునీటిని తీసుకెళ్లేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చేతి పంపు పక్కన ఎలాంటి డ్రైనేజీ లేకపోవడంతో నీరంతా రోడ్డుపైకి చేరి ఇండ్ల ముందు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చేతి పంపు చుట్టూ ఫ్లాట్‌పారం లేకపోవడంతో గుంత ఏర్పడి నిత్యం మురుగు నీరు నిల్వ ఉంటున్నది. ఈ విషయాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులకు చెప్పినా పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఈ సందర్భంగా ఆదివారం మురుగునీటిలో నిలబడి నిరసన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి, తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


రోడ్లపైకి వచ్చిన నీటిని చూపుతున్న ఎస్టీ కాలనీ ప్రజలు


జక్కెపల్లి ఎస్టీ కాలనీలో చేతి పంపు చుట్టూ ఉన్న మురుగునీరు